



• కృష్ణమ్మలోకి గోదారమ్మ!

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పరుగులు పెట్టిన గోదావరి జలాలు ఎట్టకేలకు ఆదివారం కృష్ణా నదిలో కలిశాయి. పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న గోదావరి జలాలకు కవులూరు గ్రామంలో మహిళలు ప్రత్యేక పూజలు చేసి పరవశించారు. - జి.కొండూరు





భక్తి పారవశ్యంతో..

• దుర్గమ్మకు 1826 మంది సారె సమర్పణ

భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడుతోంది. ఆషాఢ ఉత్సవాలతో మోతెక్కుతోంది. ఆషాఢ మాసం తొలి ఆదివారం దుర్గమ్మకు సారె సమర్పించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. 1826 మంది దుర్గమ్మకు సారె సమర్పించారు.

4లో..

అడ్డదారి అధికారి!



పంచాయతీరాజ్‌లో కమీషన్ల దందా

గొల్లపూడికి చెందిన ఓ టీడీపీ నాయకుడు 2019 ఎన్నికలకు ముందు గొల్లపూడి చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు రూ.70 లక్షలు పెట్టి సీసీ రోడ్లు నిర్మించారు. ఈ రోడ్ల నిర్మాణానికి క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా ఆమోద ముద్ర వేశారు. బిల్లుల చెల్లింపులు జరిగే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. బిల్లులు చేయాల్సిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీరు (డీఈ) బిల్లులను అటకెక్కించేశారు. టీడీపీ నాయకుడికి బిల్లులు చెల్లించేది లేదని తేల్చి చెప్పేశారు. ఇలాంటి బాధితులు ఉమ్మడి కృష్ణాలో పదుల సంఖ్యలోనే ఉంటాన్నారు.

కట్ చేస్తే..

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. పరిస్థితి మాత్రం మారలేదు. అదే డీఈ స్థానిక టీడీపీ ఎమ్మెల్యే ఆశీస్సులతో మళ్లీ పెనమలూరు నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్నారు. పోనీ అర్హత ఉండి ఆయన డీఈ పోస్టులో ఉన్నారా అంటే ఆయనది అసిస్టెంట్ ఇంజనీరు (ఏఈ) స్థాయి. తన పరిధిలో ఒక ఏఈని మూడు మండలాలకు ఇన్‌చార్జిగా నియమించుకుని కమీషన్ల దందా నడిపిస్తున్నారు.

- వైసీపీ హయాంలో ఏఈకి డీఈగా పోస్టింగ్
- పెద్దిరెడ్డి పేరు చెప్పి ఉమ్మడి కృష్ణాజిల్లాలో వసూళ్ల పర్వం
- ముగ్గురుంటే కమీషన్లలో పోటీ వస్తారని మూడు మండలాలకు ఒకే ఏఈ నియామకం
- ప్రభుత్వం మారడంతో అక్రమాల నుంచి రక్షణకు ప్రయత్నం
- టీడీపీ ఎమ్మెల్యే పంచన చేరి భజన

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖలో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ), రెగ్యులర్ అనే రెండు విభాగాలు ఉంటాయి. పీఐయూ విభాగానికి చెందినవారు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఇతర గ్రాంట్ల నిధులతో జరిగే భారీ పనులు పర్యవేక్షిస్తుంటారు. రెగ్యులర్ విభాగానికి చెందిన వారు జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో జరిగే పనులను పర్యవేక్షిస్తుంటారు. విజయవాడ పీఐయూ యూనిట్‌లో పనిచేసే ఏఈ స్థాయి అధికారి ఒకరు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్వహణ బాధ్యతలు చూసేవారు. 2019లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు ఏఈకి ఆయనతో పరిచయం పెరిగి క్రమేణా ఆయనకు నమ్మినబంటుగా మారారు. పెద్దిరెడ్డి ఆశీస్సులతో సదరు ఏఈ ఏకంగా డీఈ అయిపోయారు. ఎక్కడో పీఐయూ విభాగంలో పనిచేస్తున్న సదరు ఏఈని విజయవాడ రెగ్యులర్ డీఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన కోసం విజయవాడ రెగ్యులర్ డీఈగా పనిచేస్తున్న వ్యక్తిని మరో చోటికి డిప్యుటేషన్‌పై పంపేశారు.

కాసులు కురిసే పోస్టు దక్కించుకుని...

పీఐయూ విభాగం కన్నా రెగ్యులర్ విభాగంలో కాసుల వర్షం కురుస్తుంటుంది. అందుకనే సదరు ఏఈ రెగ్యులర్ డీఈగా అడ్డదారిలో పోస్టింగ్ దక్కించుకున్నారు. ఇక అక్కడి నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆయన మాటకు తిరుగులేకుండా పోయింది. ఎక్కడ పంచాయతీరాజ్ నిధులతో పనులు చేసినా అక్కడ వాలిపోయి పెద్దిరెడ్డి పేరుతో కమీషన్లు గుంజడం మొదలుపెట్టారు. తనపై అధికారులైన ఈఈ, ఎస్ఈలను సైతం లెక్కచేయని స్థాయికి ఆయన చేరిపోయారు. తన పరిధిలో జరిగే పనులకు 20 శాతం కమీషన్ చెల్లించాలని రేటు కట్టి మరీ వసూలు చేసేవారు. ఇంట్లో కూర్చొని చెక్ మెజర్‌మెంట్లు చేసి బిల్లులు తయారు చేసేవారు.

ఒక్క ఏఈతో మూడు మండలాల్లో వసూళ్లు

ఉమ్మడి కృష్ణాలో ఈయన పరిధిలో విజయవాడ రూరల్, పెనమలూరు, ఉయ్యూరు కంకిపాడు మండలాలుండేవి. జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత ఈయనకు పెనమలూరు, ఉయ్యూరు, కంకిపాడు మండలాలు మాత్రమే మిగిలాయి. ఈయన పరిధిలోని మూడు మండలాలకు ఒక్కో మండలానికి ఒక్కో ఏఈ ఉండాలి. ఎక్కువ మంది ఏఈలు ఉంటే తన అక్రమార్జనకు అడ్డువస్తారని తనకు నమ్మినబంటు లాంటి ఒక్క ఏఈనే మూడు మండలాలకు ఇన్‌చార్జిగా పెట్టుకుని కథ నడిపించేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఏ మండలంలోనూ ఈ పరిస్థితి లేదు.

అక్కడా ఉంటాం.. ఇక్కడా ఉంటాం..

డీఈ. ప్రభుత్వం మారడంతో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంచన చేరి ఆయనకు భజన చేయడం ప్రారంభించారు. ఈయన ఆశీస్సులతో ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మంత్రి కె.పార్థసారథి కూడా తన సామాజికవర్గమేనని ఆయన ఆశీస్సులు కూడా తనకు ఉన్నాయని ఈయన ప్రచారం చేసుకుంటున్నారు.

ప్రమాదం వెనుక నిర్లక్ష్యం



సైక్లోన్ ప్రీహీటర్ పేలుడు తర్వాత కర్మాగారంపై కమ్ముకున్న సిమెంట్ మేఘాలు

కిలెన్ వద్ద వరుస ఘటనలు

ఒకసారి కాదు. ఇప్పటి వరకు రెండుసార్లు అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో కిలెన్ బాయిలర్ వద్ద ప్రమాదాలు జరిగాయి. దీన్ని తక్షణమే మార్పు చేయాలని ఇంజనీర్లు తేల్చారు. అయినా కర్మాగార యాజమాన్యం మాత్రం స్పందించలేదు. కార్మికుల భద్రత విషయంలో నిలువునా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఆ నిర్లక్ష్యంగా ఇప్పుడు ఒక కార్మికుడి ప్రాణాలు తీసింది. మరికొంత మందిని చావుబతుకుల మధ్య పడేసింది. ఇంకొంతమందిని గాయాలపాలు చేసింది.

బాయిలర్‌ను మార్పు చేయని కంపెనీ యాజమాన్యం

- రోడ్డున పడిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబం
- పరిహారం ప్రకటించని కంపెనీ
- 'అల్ట్రాటెక్' ముందు గ్రామస్తుల ఆందోళన
- పరిపాలన భవనంపై దాడి
- దాడిలో ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల ధ్వంసం
- క్షతగాత్రులకు ఎమ్మెల్యే, అధికారుల పరామర్శ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/ జగ్గయ్యపేట రూరల్) : లైమ్‌స్టోన్ ఎర్రమట్టి మిక్సింగ్ చేసే బాయిలర్ (కిలెన్) 1200-1400 సెల్సియస్ హీట్‌లో ఉంటుంది. అది ఒక్కసారిగా పేలటంతో పౌడర్ రూపంలోని క్లింకర్ బయటకు వెదజల్లి పరిసరాల్లోని కార్మికులపై పడింది. దీంతో ప్రాణభయంతో కార్మికులు పరు గులు పెట్టారు. సమీపంలోని 15 మందిపై ఎక్కువ స్థాయిలో బూడిద పడటంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో బూదవాడ కు చెందిన ఎనిమిది మంది, మిగిలినవారు బీహార్, ఉత్తర ప్రదేశ్‌లకు చెందిన వారు ఉన్నారు. ప్రమాద సమ యంలో గాయ పడిన వారిని విజయవాడ తరలించారు. గాయపడిన 15 మందిలో 8మంది బూదవాడకు చెందినవారు. - మిగతా 4లో



కాలిన గాయాలతో కార్మికుడు

సైక్లోన్ ప్రీహీటర్ పేలటంతోనే ప్రమాదం

జగ్గయ్యపేట : సిమెంట్ కర్మాగారంలో ప్రీహీటర్‌లో సమస్యలతోనే పేలినట్టు కార్మికులు ఆరోపిస్తున్నారు. గతంలో సైక్లోన్ ప్రీహీటర్‌లో సమస్యలు రావటంతో కార్మికులు సంబంధిత విభాగానికి ఫిర్యాదు చేసినా స్పందించలేదు. కిలెన్‌లో వేసే ముడిపదార్థాల్లో ఉండే యాసిడ్లను తొలగించేం దుకు, సిమెంట్ నాణ్యతను పెంచేందుకు ప్రీహీటర్ సైక్లోన్‌లో ఉంచుతారు. ఇక్కడ 800 డిగ్రీల సెల్సి యస్‌పైగా ఉష్ణోగ్రత ఉంటుంది. సైక్లోన్ ప్రీహీటర్‌లో ముడిపదార్థాలు కలిసే సంద ర్భంలో ఈ పేలుడు సంభవించింది. భారీ వేడితో ఉండే సిమెంట్ కార్మికులకు అంటుకు పోవటంతో కార్మికులు శరీరాలు కాలిపోయాయి.

కొద్దిరోజుల్లో కాలువలకు సాగునీరు విడుదల చేయనుండటంతో శివారు ప్రాంతాల రైతులు నారు మడులు పోసేందుకు సిద్ధమవుతున్నారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే ఈ నెలాఖరు నాటికి నారుమడులు పోస్తారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు వరి విత్తనాల ధరలను పెంచేశారు. ఎకరానికి సరిపడా *30* కిలోల విత్తనాల బ్యాగు సర్టిఫైడ్ విత్తనాలను రూ.*1800*కు పెంచి విక్రయి స్తున్నారు. గతంలో విత్తనాల బ్యాగ్ ధర రూ.*1600* ఉండగా ఇటీవల మరో రూ.*200* పెంచి విక్రయాలు జరుపుతున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే నాన్‌సర్టిఫైడ్ విత్తనాలు ఒక్కో బ్యాగ్ రూ.*1600* ధరకే ఇస్తామని, మొలకశాతం తక్కువగా ఉంటుందని కావాలంటే తీసుకు వెళ్లవచ్చని చెబుతున్నారు.

వరి విత్తనాల ధరలకు రెక్కలు



ఇప్పటివరకు సాగైంది 9,238 హెక్టార్లు

- వెదజల్లే పద్ధతిపైనే అధిక శాతం రైతుల ఆసక్తి
- ఈ-క్రాప్ నమోదు సక్రమంగా చేయాలని రైతుల వేడుకోలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో రైతులకు ప్రభుత్వమే సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు అందించాలి. అయితే కేవలం 6,600 క్వింటాళ్ల విత్తనాలు ఇచ్చి వ్యవసాయశాఖ అధికారులు చేతులు దులుపుకున్నారు. రైతులందరికీ వరి విత్తనాలు సబ్సిడీపై ఇవ్వలేమని, బహిరంగ మార్కెట్ నుంచి సమకూర్చుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

వరిసాగు అంచనా 1.65 లక్షల హెక్టార్లలో

జిల్లాలో ఈ ఏడాది 1.65 హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని అంచనాగా ఉంది. జూలై 15 నాటికి కాలువలకు సాగునీటిని విడుదల చేస్తే నారుమడులు పోసేందుకు, లేదా వెదజల్లే పద్ధతి ద్వారా విత్తనాలు జల్లేందుకు రైతులు సమాయాత్తమవుతున్నారు. ఈ నెలాఖరునాటికి వరి నారుమడులు పోయడం పూర్తిచేస్తే ఆగస్టు చివరినాటికి వరినాట్లు పూర్తవుతాయనే అంచనా ఉంది. ఇప్పటివరకు బోరునీటి ఆధారంగా 20 వేల హెక్టార్లలో వెదజల్లే పద్ధతి, నాట్లువేసే పద్ధతిలో వరినాట్లు వేశారు. ఇందులో వెదజల్లే పద్ధతి ద్వారా సాగుచేసిన పొలమే అధికంగా ఉంది. నారుమడులు 2వేల హెక్టార్లలో పోసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఈ- క్రాప్ సక్రమంగా జరిగేనా?

ప్రతిఏటా రైతులు సాగుచేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లోలో నమోదు చేయాల్సి ఉంది. జిల్లాలో సాగుచేసిన వివిధ పంటల వివరాలు, భూమి సర్వే నెంబర్లు, రైతుల పేర్లు సక్రమంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి. ఆర్‌బీకేలలో పనిచేసే వ్యవసాయ సహాయ అధికారులు (వీఏఏ)లు పొలాల వద్దకు వెళ్లి రైతులు సాగుచేసిన పంట వివరాలను నమోదుచేసి, సంబంధిత ఫొటోలను ప్రభుత్వం సూచించిన యాప్‌లో సక్రమంగా నమోదు చేయాల్సి ఉంది. ఈ-క్రాప్, ఈకేవైసీ సక్రమంగా నమోదు చేస్తేనే పంట నష్టపరిహారం, పంటబీమా, విత్తన సబ్సిడీ, మద్దతు ధర, పంటరుణాలపై సున్నా వడ్డీ రైతులకు వచ్చే అవకాశం ఉంది. ఇంతటి కీలకమైన ఈ-క్రాప్ నమోదును ఈ ఏడాదైనా సక్రమంగా చేయాలని రైతులు కోరుతున్నారు.

కావాల్సిన ఎరువులు 88,601 టన్నులు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలకు కలిపి 88,601 టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. యూరియా 38,333 టన్నులు, డీఏపీ 10,529 టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 3,921 టన్నులు, ఎస్ఎస్‌పీ 7,361 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 32,8457 టన్నుల ఎరువుల వినియోగం ఉంటుందని అంచనాగా ఉంది. ప్రస్తుతం జిల్లాలో అన్ని రకాల ఎరువులు 53,388 టన్నులు అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ వరిలో చివరికోటా లేదా చిగురుకోటాగా వేసే పొటాష్ ఎరువు అందుబాటులో లేకుండా కృత్రిమ కొరతను సృష్టించడం రెండుమూడు సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఈ పరిస్థితి తలెత్తకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

విధివిధానాలేమిటో..?

నేటి నుంచి ఉచిత ఇసుక - విధానంపై స్పష్టత ఇవ్వని అధికారులు

- పేద ప్రజలు, భవన నిర్మాణ రంగ కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఉచిత ఇసుక పథకం
- గత ప్రభుత్వంలో ఇసుక సిండికేట్‌దే రాజ్యం...
- ఎన్టీఆర్ జిల్లా నుంచి తెలంగాణాకు భారీగా రవాణా
- దీన్ని నియంత్రించకపోతే సామాన్యులకు ఇసుక కష్టం
- సరిహద్దు ప్రాంతాలు, రాజమార్గాలు, దొడ్డిదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే మేలు



నిర్ణయించిన నామమాత్రపు ధరలు ఇలా :

	స్టాక్‌యార్డు / డిపో	ధర (టన్నుకు)
1.	కంచల	రూ. 313
2.	మాగల్లు	రూ. 228
3.	కొడవటికల్లు	రూ.252
4.	అల్లూరుపాడు	రూ. 234
5.	అనుమంచిపల్లి	రూ. 313
6.	పోలంపల్లి	రూ. 210
7.	కీసర	రూ. 325
8.	మొగలూరు	రూ. 240

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల) : ఉచిత ఇసుక పథకం నేటి నుంచి ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అమలౌతుంది. ఈ పథకం సాఫీగా సాగాలంటే జిల్లా యంత్రాంగం స్పష్టమైన విధివిధానాలతో ముందుకు వెళ్లాలి. అయితే ఇప్పటివరకు ఇసుక ఎవరికి ఇస్తారన్నదానిపై స్పష్టత లేదు. జిల్లా యంత్రాంగం కూడా ఆ మేరకు స్పష్టత ఇవ్వలేదు. పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రంలో ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఉంది. అక్కడ భారీగా పెరిగిపోతున్న నిర్మాణరంగంతో ఎన్టీఆర్ జిల్లా నుంచి వైసీపీ హయాంలో అక్రమంగా ఇసుక తరలిపోయింది. రోజుకు 20 మెట్రిక్ టన్నుల ఇసుకను ఇస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన శనివారం నాటి సమావేశంలో అధికారులతో చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాధాన్యతలు నిర్ణయించుకోకపోతే మాత్రం శాండ్ సిండికేట్ కూడా ఇసుక కోసం వాలిపోయే పరిస్థితి ఉంటుంది. ప్రాధాన్యతలను నిర్ణయించటంలో జిల్లా యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రాధాన్యత ఇలా ఉంటే మేలు

మొదటి ప్రాధాన్యత సొంతంగా ఇళ్లు, కాంక్రీటు నిర్మాణాలు చేసేవారికి ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆ తర్వాత బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపింగ్ సంస్థలు నిర్మించే భవనాలు, అపార్ట్‌మెంట్స్, గ్రూప్ హౌస్‌లు, బహుళ అంతస్థుల భవనాలు, హై రైజ్ భవనాలు, ప్రభుత్వ డెవలప్‌మెంట్ వర్క్స్ చేపట్టే కాంట్రాక్టర్లకు ఇలా ప్రాధాన్యతలు నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉంది.

స్పష్టతలేని అంశాలివే..

- సామాన్య ప్రజలు ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేసుకునే వారికి ఏ ప్రాతిపదికన ఇసుక ఇస్తారన్నది ముఖ్యం. ఇల్లు కడుతు న్నారో లేదో తెలుసుకోవటానికి క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది ద్వారా తెలుసుకునే విధానాన్ని అమలు చేస్తున్నారా? గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే.. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ధ్రువీకరించిన తర్వాతే ఇసుకను ఇస్తారా? మరేదైనా విధానం ఉందా అన్న దానిపై స్పష్టత లేదు.
- వినియోగదారుడే వాహనాన్ని మాట్లాడుకుని తీసుకురావాల్సి ఉంటుందని జిల్లా యంత్రాంగం నిర్దేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టాక్‌యార్డుల్లోనే రవాణా వాహనాల సిండికేట్ రాజ్యమేలింది. రవాణా చార్జీలను అడ్డగోలుగా వసూలు చేశాయి. స్టాక్ యార్డులలో ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉండవా? ఉంటే.. జిల్లా యంత్రాంగ పర్యవేక్షణలోనే ఉంటాయా? అనే స్పష్టత లేదు.

చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి

ఎన్టీఆర్ జిల్లా.. పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతంగా ఉంది. ఖమ్మం, హైదరాబాద్‌లలో విపరీతంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో అక్కడ ఉన్న ఇసుక డిమాండ్ రీత్యా ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇప్పటి వరకు అక్రమంగా వివిధ మార్గాల్లో తరలివెళ్లింది. జాతీయ రహదారి - 65తో పాటు, ఎన్‌హెచ్ - 30ల మీదుగానూ అక్రమంగా ఇసుక రవాణా జరిగింది. ఇవి కాకుండా కంచికచర్ల - మధిర, నందిగామ - మధిర ఆర్‌అండ్‌బీ రోడ్ల మీదుగా కూడా అడ్డదారిలో తెలంగాణా ప్రాంతానికి అక్రమంగా ఇసుక తరలివెళ్లేది. వీరులపాడు, నందిగామ, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట రూరల్, వత్సవాయి గ్రామాల నుంచి మొత్తం 15 డొంక రోడ్లు ఉన్నాయి. తెలంగాణా ప్రాంతానికి ఈ డొంక మార్గాల్లోనూ అక్రమంగా ఇసుక తరలివెళ్లేది. ఈ మార్గాల్లో చెక్‌పోస్టులు పెడితే తప్ప ఇసుక అక్రమ వ్యాపారాన్ని నిలువరించే పరిస్థితి ఉండదు.

నామినల్ ధరలు నిర్ణయం

జిల్లా స్థాయి ఇసుక కమిటీలో కలెక్టర్ నిర్ణయం స్టాక్ యార్డులు, డిపోలలో ఇసుక ధరలను ఎన్టీఆర్ జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఖరారు చేసింది. నిర్వహణ ఖర్చుల కోసం నామినల్ ఫీజులను మాత్రమే స్థానిక సంస్థల కోసం వసూలు చేయనున్నారు. నామినల్ ఫీజు, సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ, ర్యాంపులలో తవ్వకం, యార్డులు, డిపోలకు రవాణా ఛార్జీలు వంటివి కలిపి టన్నుకు నామినల్ ధరను నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లాలో నిర్ణయించిన ధరలను జిల్లా కలెక్టర్ జీ సృజన ఆదివారం రాత్రి ప్రకటించారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె







దుర్గమ్మవారికి సారె సమర్పిస్తున్న గణాచారిల బృందం

» మొక్కులు తీర్చుకున్న భక్తులు.. ఆదివారం కిటకిటలాడిన ఆలయం

వన్‌టౌన్, జూలై 7 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం రెండవరోజైన ఆదివారం వార్షిక సంప్రదాయం ప్రకారం భారీగా సారె సమర్పణలు జరిగాయి. విజయవాడకు చెందిన రామారావు బృందం 200 మంది, జి.రమణి బృందం 150 మంది, కె.దుర్గాభవాని బృందం 300 మంది, వాగు సెంటర్‌కు చెందిన రంగమ్మ బృందం 100 మంది తదితరులు మొత్తంగా 1826 మంది అమ్మవారికి సారె సమర్పించారు. ఇదే సమయంలో భక్తులు సమర్పించిన పట్టు చీరలకు ఈవో కేఎస్ రామారావు క్యూఆర్ కోడ్ రశీదులను అందజేశారు.

సారె సమర్పించిన గణాచారిలు

దుర్గమ్మవారికి విజయవాడ గణాచారిలు పెద్ద సంఖ్యలో ఆదివారం సారె సమర్పించారు. తొలుత బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డిలో పూజలు నిర్వహించి అక్కడ్నుంచి అమ్మవారికి జేజేలు పలుకుతూ ఊరేగింపుగా ఇంద్రకీలాద్రి చేరుకుని సారె సమర్పించారు. కేరళ వాయిద్యాలు, కళాకారుల ప్రదర్శనలు తదితర విశేష అంశాలతో ఘనంగా ఊరేగింపు సాగింది. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



వన్‌టౌన్ : దుర్గగుడి ధర్మపథం వేదికపై ఆదివారం విశాఖపట్నానికి చెందిన వరసిద్ధి వినాయక కూచిపూడి కళాశాలకు చెందిన శిష్యబృందం నాట్యప్రదర్శన చేసింది. జి.కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో అంబాష్టకం, మహాకనకదుర్గా నాట్యంతో పాటు మొత్తం 16 కీర్తనలకు కూచిపూడి నృత్యం చేశారు. హావభావ ఆహార్యం, నటనశైలిలో తమదైన ముద్రను ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు.

భక్తుల భోజనాలపై ఈవో ఆరా..

దేవస్థానంలో రాత్రిపూట బసచేసే భక్తులకు భోజన సదుపాయంపై ఈవో రామారావు ఆదివారం రాత్రి ఆరా తీశారు. స్వయంగా భక్తుల వద్దకు వెళ్లి భోజనంలో క్వాలిటీ, శుభ్రత తదితర అంశాలపై భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఇంకా మెరుగ్గా భోజన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆయన అధికారులకు సూచన చేశారు.

సుబ్బారాయుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మోపిదేవి, జూలై 7 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేషపూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తి దంపతులకు అందజేశారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి

తిరుపతమ్మను దర్శించిన ఖమ్మం ఎంపీ

పెనుగంచిప్రోలు : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి ఆదివారం తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఎంపీకి ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఆదివారం తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో కె.రమేశ్ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తి పారవశ్యంలో ముంచెత్తారు..



గీతాలు ఆలపిస్తున్న మనస్వి, మయూఖి

చల్లపల్లి : వారిద్దరూ అమెరికాలో పుట్టారు. తల్లిదండ్రులు తెలుగువారు కావటం, ఏటా సెలవులకు భారతదేశం వచ్చివెళుతుండటంతో తెలుగుమూలాలతో, తెలుగు సంస్కృతి.. సంప్రదాయాలను పుణికిపుచ్చుకున్నారు. తొమ్మిది నెలలుగా ఆన్‌లైన్‌లో సంగీతం శిక్షణ పొందుతూ ఆదివారం అమ్మ స్వగ్రామంలో పాటకచేరి ఇచ్చి ఔరా అనిపించారు. వారే చల్లపల్లి మండలం మేకావారిపాలేనికి చెందిన పారిశ్రామికవేత్త గుత్తికొండ కోటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల మనుమరాళ్లు మనస్వి, మయూఖిలు. ప్రవాస భారతీయులైన కొల్ల శ్రీనివాస్-నవదుర్గా భవానీ కుమార్తెలైన మనస్వి.. మయూఖిలు ఆన్‌లైన్ ద్వారా సంగీతం నేర్చుకున్నారు. సెలవులకు తల్లిదండ్రుల స్వగ్రామాలకు వచ్చిన నేపథ్యంలో ఆదివారం మేకావారిపాలెంలోని రామాలయం ఆవరణలో పాటకచేరి ఏర్పాటు చేయగా, భక్తిపాటలను ఆలపించి ఆహూతులను మైమరపింప చేశారు. పాశ్చాత్య మోజులో తెలుగుభాషనే మర్చిపోతున్న నేటికాలంలో అమెరికాలో జన్మించిన వీరు సంప్రదాయబద్ధంగా సంగీతం నేర్చుకుని కచేరి నిర్వహించిన తీరు స్థానికులను మంత్రముగ్ధులను చేసింది. మనస్వి, మయూఖిలను అందరూ అభినందించి ఆశీర్వదించారు.

పోలవరం కాల్వకు గోదావరి నీళ్లు..

» ఆయకట్టు రైతుల హర్షాతిరేకాలు



పోలవరం కాలువలో జలహారతిస్తున్న రైతులు

పాయకాపురం : కూటమి ప్రభుత్వం.. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఐదేళ్ల వైసీపీ పాలనలో అయికట్టు రైతులు ఎదుర్కొన్న సమస్యలు తొలగిపోయాయని గన్నవరం నియోజకవర్గ రైతు అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి అన్నారు. నున్న గ్రామ సమీపంలోని పట్టిసీమ పోలవరం గోదావరి నీళ్లకు ఆదివారం రైతులు జలహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పోలవరం పట్టిసీమ కాలువ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను ఆన్‌చేసి గోదావరి నీటిని చెరువులకు వదిలారు. అనంతరం గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్త విధానాలతో ఆయికట్టు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చీరాగానే ఆయకట్టు రైతుల సంక్షేమం కోరుతూ పంట పొలాలకు నీరు అందించడం ఎంతగానో ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస్ రెడ్డి, మాదు శివరామ్ ప్రసాద్, గంపా శ్రీనివాస్ యాదవ్, బొకినాల తిరుపతిరావు, యార్కారెడ్డి వెంకటరెడ్డి, ఈడే పోతురాజు, డిల్లీ కోటేశ్వరరావు, బేతపూడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థ ఏపీ గౌరవాధ్యక్షుడిగా కొల్లి



జి.కొండూరు, జూలై 7 : తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ కమిటీ నిర్ణయం మేరకు ఏపీ గౌరవాధ్యక్షునిగా జి.కొండూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ చైర్మన్, విద్యావేత్త కొల్లి నాగేశ్వరరావును నియమిస్తూ ఆసంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. ఈమేరకు కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి ఎల్లావేళలా అందుబాటులో ఉంటానని శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తనపై ఇంత బాధ్యత పెట్టినందుకు చైర్మన్‌కు, జాతీయ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్‌కు, జాతీయ ప్రధాన కార్యదర్శి వలబోజు మోహన్‌రావుకు కొల్లి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

విజయవాడ లీగల్, జూలై 7 : ఎన్టీఆర్ జిల్లాలో ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన ఈపీఎఫ్‌వో పర్సనల్



అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఈపీఎఫ్‌వో పరీక్షకు 2,401 మంది, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులకు విజయవాడలో 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా కలెక్టర్ సృజన పీబీ సిద్ధార్థ కళాశాలలోని కేంద్రాన్ని తనిఖీ చేశారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. ఈపీఎఫ్ఓ పరీక్షకు 526 మంది (21.91 శాతం), ఈఎస్ఐసీ పరీక్షకు 4,074 మంది (74.99 శాతం) హాజరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు అభినందనలు తెలిపారు.

బూదవాడ ఘటనపై పూర్తిస్థాయి విచారణ

» క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
» బాధిత కుటుంబాలను ఆదుకుంటాం
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 7 : జగ్గయ్యపేట మండలం, బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో



ఘటనను కలెక్టర్‌కు వివరిస్తున్న బాధితులు

జరిగిన ప్రమాద ఘటనపై పూర్తి విచారణకు ఆదేశించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. నివేదికలను అనుసరించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రి, గొల్లపూడి ఆంధ్రా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ పరామర్శించారు. ఆంధ్రా హాస్పటల్‌లో 8 మంది, మణిపాల్ హాస్పటల్‌లో 8 మంది చికిత్స పొందుతున్నారని, 16 మందిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా వుందన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించినట్టు ఆమె తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారి బంధువులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో 8 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వారు కాగా, పల్నాడు జిల్లాకు చెందిన వారు ఒకరు ఉన్నారన్నారు. ఐదుగురు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు కాగా, ఒకరు జార్ఖండ్, మరొకరు బీహార్‌కు చెందిన వారు ఉన్నట్టు ఆమె తెలిపారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తదితరులున్నారు.

ప్రమాదం వెనుక నిర్లక్ష్యం

(3వ పేజీ తరువాయి)

వారిలో ఆవుల వెంకటేశ్ మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాణావత్ స్వామి, గుగులోతు బాలాజీ, గుగులోతు గోప్యా నాయక్, బాణావత్ సైదా, వేముల సైదులు, దారావత్ వెంకటేశ్వరరావు, పరిటాల అర్జున్, ఆవుల వెంకటేశ్వరరావులు బూదవాడ వాస్తవ్యులు. వివేక్‌సింగ్, నగేంద్ర సుదాసింగ్, శుభం సోనీ, గుడ్డు కుమార్, అరవింద్ జైపాల్, దినేష్ కాస్యప, రవికుమార్ విశ్వకర్మ బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు. బాణావత్ స్వామిని కుటుంబ సభ్యులు జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని విజయవాడకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం స్వామిని విజయవాడ తరలించారు. గాయపడిన కార్మికులను గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రి, తాడేపల్లిలో ఉన్న మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. వారిని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంగోపాల్, కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ పరామర్శించారు.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో కెలన్ బాయిలర్ పేలడంతో బూదవాడ గ్రామవాసుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రమాద ఘటన గురించి తెలియగానే చుట్టుపక్కల ఉన్న వాళ్లంతా అక్కడికి పరుగులు తీశారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించిన తర్వాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా గ్రామస్థులు ఆగలేదు. కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. మధ్యాహ్నం నుంచి కంపెనీ వద్ద గ్రామస్థులు గుమిగూడారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై నినాదాలు చేశారు. బాయిలర్ వద్ద ఇంతకుముందు రెండు, మూడు సార్లు ప్రమాదాలు జరిగినా యాజమాన్యంలో చలనం లేదని ధ్వజమెత్తారు. దీనివల్ల రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికులు కనుమరుగైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కార్మికులు కంపెనీ ఆవరణలో ఉన్న పరిపాలనా భవనంపై రాళ్లు రువ్వడంతో కార్యాలయం లోపల ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు ధ్వంసమయ్యాయి. గ్రామస్థులు ఆగ్రహంతో ఊగిపోతుండడంతో పోలీసులు వారితో చర్చలు జరిపి శాంతింపచేశారు.

రోడ్డున పడిన కుటుంబం

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు. పాపంపుణ్యం తెలియని ఇద్దరు పసిపాపలు. తానే జీవితం అనుకున్న భార్య. ఇదీ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆవుల వెంకటేష్ (36) కుటుంబపరిస్థితి. బూదవాడ గ్రామానికి చెందిన వెంకటేష్ నాలుగైదేళ్ల క్రితం కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా చేరాడు. అతడి తండ్రి వీరయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. తల్లి రమాదేవి వృద్ధురాలు. వీరు కాకుండా భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొత్తం కుటుంబభారాన్ని వెంకటేశ్ మోస్తున్నాడు. చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలోనే సిమెంట్ కంపెనీ ఉండటంతో ఇక్కడే పనిచేసుకుంటూ కుటుంబాన్ని చూసుకోవచ్చన్న ఆలోచనలో అతడు ఉన్నాడు. కెలన్ బాయిలర్ వద్ద పేలుడు ఘటనలో ఆ మిశ్రమంపై పడటంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికి అతడు ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. వృద్ధాప్యంలో తమకు దిక్కు ఎవరని తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. కష్టానికి వెళ్లిన కట్టుకున్న భర్త ప్రాణాలు కోల్పోవడంతో ఆమె కన్నీరుమున్నీరవుతోంది.

చంద్రబాబు, మంత్రి ఆరా

అల్ట్రాటెక్ కంపెనీలో ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధికారులతో మాట్లాడారు. ఘటన జరగడానికి గల కారణాలు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. దీనిపై ఒక నివేదికను రూపొందించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

» బొప్పరాజు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు

బస్‌స్టేషన్, జూలై 7 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే ముఖ్యమంత్రిని కలవనున్నట్టు ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం విజయవాడలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి 11వ పీఆర్సీ బకాయిలు, 2018 నుంచి డీఏ బకాయిలు, తదితర అంశాలను వివరించామని త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిసి సమస్యలను వివరిస్తామని తెలిపారు. 16 లక్షల మంది ఉద్యోగుల ఆవేదన, వారు పడుతున్న ఇబ్బందులను వివరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. స్టేట్ జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసి రిఫరల్ ఆసుపత్రుల వైద్య సౌకర్యాలను తొలగించారన్నారు. ప్రస్తుతం ప్రతి ఉద్యోగి నుంచి రూ.300 వరకు జీతాల నుంచి రికవరీ చేస్తున్నా వైద్య సౌకర్యాలు అందుబాటులో లేని పరిస్థితి ఉందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆర్టీసీ లాభపడుతుందని, అయితే బస్సుల సంఖ్యను పెంచి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ, మాజీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి పెన్షనర్లు పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో పాటు ఉద్యోగులకు సంబంధించి అనేక అంశాలపై లేఖలు ఇచ్చి చర్చించామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యంరాజు, ఉపప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, ఎండీ ప్రసాద్, ఇ.భానుమూర్తి, స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి ఎండీఏ సిద్ధిక్‌తో పాటు 26 జిల్లాలకు చెందిన రాష్ట్ర కమిటీల బాధ్యులు, జోన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సమతా సైనికదళ్

జగన్ అహంకారం వీడాలి

» సమతా సైనికదళ్

గవర్నర్‌పేట, జూలై 7 : దళిత, బడుగు, బలహీన వర్గాల పట్ల నిరంకుశ వైఖరి వల్లే వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని, పార్టీని ఎస్సీ, ఎస్టీ, బీసీలు పాతాళానికి నెట్టేశారని, ఇప్పటికైనా జగన్ తన అహంకార వైఖరి విడనాడాలని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సూచించింది. ఆదివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకెలో సమతా సైనికదళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి అన్ని జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పాలేటి మహేశ్వరరావు మాట్లాడుతూ, చంద్రబాబు నేతృత్వంలో నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు వైసీపీని పూర్తిగా తిరస్కరించినా జగన్ మంత్రివర్గంలో పనిచేసిన కొందరు మాజీలు విద్వేష పూరిత ప్రసంగాలు చేసి రాష్ట్రంలో దాడులకు కుట్ర పన్నుతున్నారని, ప్రజలు వీటిని గ్రహించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని మరల ప్రవేశపెట్టడం, బడుగు, బలహీన వర్గాల వారికి, మహిళలు, వికలాంగులకు పెన్షన్ పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలని చంద్రబాబును కోరారు. ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళిత యువకుడు సుబ్రహ్మణ్యం కేసును సీబీఐ విచారణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో దుర్వినియోగం చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, సంఘం అధ్యక్షుడు గొల్ల వరప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

» మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 7 : ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర మైన్స్ ఎక్సైజ్, జియాలజీశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఆదివారం మంత్రి రవీంద్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, టీడీపీ నాయకులు తమ డివిజన్లలోని సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఆదివారం మంత్రికి 620 మంది వినతిపత్రాలు సమర్పించారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి రవీంద్రకు సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను మంత్రి అక్కడికక్కడే పరిష్కరించారు.

నూతన కార్యవర్గం



వన్‌టౌన్, జూలై 7 : ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా ఎం.శ్రీనివాస్, పరిశీలకులుగా శ్యామ్‌సుందర్ వ్యవహరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ కార్యక్రమానికి హాజరై నూతనంగా ఎన్నికైన కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యులను అభినందించారు. అధ్యక్షుడిగా విజయవాడకు చెందిన వెన్నా రమేష్, సహ అధ్యక్షుడిగా మచిలీపట్నానికి చెందిన ఎం.శ్రీహరి బాబ్జి, ఉపాధ్యక్షులుగా వి.శ్రీనివాసురావు, పీవీ దుర్గారావు, జి.చెన్నకేశవరావు, కార్యదర్శిగా కేవీ కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్‌కే అమీర్‌బాషా, మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా వై.రేణుక, సంయుక్త కార్యదర్శులుగా జేవీఆర్ రాజా, జి.మాధవరావు, జె.పద్మజవాణి, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎ.సుకన్య, కోశాధికారిగా జీవీ రాకేష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డి.బాలకృష్ణ, స్టేట్ కౌన్సిలర్‌గా పి.వాసుదేవరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నరక ప్రయాణం!

» జనరల్ బోగీలలో ప్రయాణికుల దుస్థితి
» బోగీల కుదింపు.. రైళ్ల రద్దుతో దయనీయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఒక వైపు రైళ్ల రద్దు.. మరోవైపు జనరల్ బోగీల కుదింపు.. వెరసి సామాన్యులు రైలు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనరల్ బోగీలు సరిపోక అష్ట కష్టాలు పడుతున్నారు. దీంతో రైలు ప్రయాణం నరకప్రాయంగా మారింది. విజయవాడ-కాకినాడ మధ్య నడిచే రైళ్లలో జనరల్ బోగీలు



కిటకిటలాడిపోతున్నాయి. ఉన్న బోగీలు సరిపోక కిందే కూర్చుంటున్నారు. మరుగుదొడ్లకు వెళ్లే చోటునూ ప్రయాణికులు ఆక్రమించేస్తున్నారు. అటువైపు కాలుకూడా పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఎవరైనా బాత్రూమ్‌కు వెళ్లాలన్నా.. వీరిని దాటుకుని వెళ్లలేని దైన్యపరిస్థితి. అన్ని రైళ్లలోనూ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రైళ్లలో ఉండాల్సిన నాలుగు జనరల్ బోగీలను రెండింటికి తగ్గించారు. స్లీపర్ కోచ్‌లను సగానికి సగం తగ్గించారు. దీంతో సామాన్య ప్రయాణికులకు బోగీలు సరిపోవటం లేదు. దీనికితోడు రైళ్ల రద్దుతో పరిస్థితి మరింత జటిలంగా మారుతోంది. రైల్వేబోర్డు అయినా కళ్లు తెరిచి సామాన్యుల కష్టాలను తీర్చాలన్న డిమాండ్ వ్యక్తం అవుతోంది.

పక్కా వార్డుల్లోనే పత్తా లేకుండా పోయాం..

సామినేని నిర్వేదం!

జగ్గయ్యపేట, జూలై 7 : ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి రాత్రింబవళ్లు ఆలోచిస్తునే ఉన్నా.. నిద్ర పట్టడంలేదు.. ఇంత ఘోర ఓటమి ఎలా పొందాం.. పేటలో పక్కా వార్డులలో పత్తా లేకుండా పోయాం.. గ్రామాల్లోను అదే పరిస్థితి.. అని జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లెదుటే ఇవీఎంలు సీల్ వేశారు.. తీశారు. అవకతవకలు జరిగాయి.. ఆధారాల్లేవు అంటూ వాపోయారు. ఆదివారం బి.కన్వెన్షన్ హాలులో ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి కార్యకర్తల సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఒక కార్యకర్త తరచు అడ్డు తగులుతుండటంతో ఆయన స్టేజి దిగి వచ్చి చేయిచేసుకుని బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాల అనంతరం దాడుల్లో నష్టపోయిన ఆరుగురు కార్యకర్తలకు రూ.3.50లక్షల పరిహారాన్ని అందజేశారు. సమావేశంలో మాజీ చైర్మన్లు, మునిసిపల్ కౌన్సిలర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు వంత పాడిన వైసీపీ నేత

తిరువూరు: గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్ కాలసాని చెన్నారావు(రాడ్డు)ను సమర్థిస్తూ వైసీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని టీడీపీ నాయకులు వాసం మునియ్య, బొమ్మసాని మహేశ్‌లు విమర్శించారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గతంలో ఎ.కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ అరాచకాలు చేస్తున్నాడని, ఎ.కొండూరు స్టేషన్‌లో చెన్నారావుపై కేసు పెట్టిన స్వామిదాసుకు.. వైసీపీలోకి వెళ్లగానే రౌడీషీటర్ మహాత్ముడైనట్టు నంగనాచి కబుర్లు చెప్పడం ఆయన రాజకీయ దౌర్భాగ్యమన్నారు. ఎమ్మెల్యే కొలికపూడిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వైసీపీ నేతలు ప్రజల్ని మభ్యపెట్టేలా కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు సింధు శ్రీను, చిత్తలూరి శశి, మొహిద్దీన్, మస్తాన్, భూమా సురేశ్, చిత్తలూరి నరసింహారాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన ఇసుక గుంత

» మునేరులో దిగి బాలుడి మృతి



జగ్గయ్యపేట, జూలై 7 : పోలంపల్లి వద్ద మునేరు ఆనకట్ట వద్ద ఆదివారం ఇసుక కోసం అక్రమార్కులకు తీసిన గుంత బాలుడి ప్రాణాన్ని బలిగొన్నది. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేరు డ్యాంను చూసేందుకు వత్సవాయి సమీపంలో బోనకల్లు నుంచి ఆరుగురు స్నేహితులు సరదాగా వచ్చారు. వారిలో సాయి (14) మునేటిలోకి దిగాడు. అంతంతమాత్రం నీటి ప్రవాహం ఉండటంతో డ్యాంలోకి వెళ్లగా అక్కడ ఇసుక కోసం తవ్విన గుంతను గమనించక అందులో పడి పైకి రాలేకపోయాడు. స్నేహితుల కేకలు విని పక్కన ఉన్న రైతులు వచ్చి బాలుడిని బయటకు తీసేలోపే మృతి చెందాడు. ఇసుక కోసం 10- 20 అడుగుల లోతున గోతులు తవ్వటం, అక్కడ నీరు చేరటంతో గమనించని బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ప్రాంతం తెలంగాణలో పెదమండవ గ్రామ పరిధిలో ఉండటంతో ముదిగొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

186 మందికి వైద్యపరీక్షలు

గండిగుంట(ఉయ్యూరు), జూలై 7 : గండిగుంట శ్రీగణపతి సచిదానంద జ్ఞానబోధ సభ ఆవవరణలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. 186 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. గుడివాడ ప్రభుత్వ హోమియో వైద్యశాల డాక్టర్ ప్రదీప్ తదితరులు రోగులను పరీక్షిం చారు. చేశారు. జ్ఞానబోధ సభ సభ్యులు పురుషోత్తం తదితరులు సేవలందించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా అవసరం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్



వీరమ్మ ఆలయ ప్రాంగణంలో వైద్యశిబిరం ప్రారంభిస్తున్న రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, జూలై 7 : నేటి కాలమాన పరిస్థితుల్లో వైద్యఖర్చులు పేద, మధ్యతరగతి ప్రజలకు భారమవుతున్న నేపథ్యంలో ఆరోగ్యసంరక్షణకు ఆరోగ్య బీమా ఎంతో కీలకమైందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. వీరమ్మ ఆలయ ప్రాంగణంలో టర్టిల్మింట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ, యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి రోజుల్లో పెరుగుతున్న రకరకాల వ్యాధులు, ప్రమాదాలు వాటికి అవుతున్న ఖర్చులు సామన్య, మధ్యతరగతి ప్రజలకు మోయలేని భారంగా మారాయన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా అవసరం ఏర్పడిందన్నారు.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



మారేడుమాకలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మారేడుమాక (కంకిపాడు), జూలై 7 : ఎన్నికల వరకే రాజకీయాలు అని ఆతరువాత నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలం లోని మారేడుమాక గ్రామంలో రూ. 6.60 కోట్లతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, రాజకీయాల్లో చేరిన కొత్త తరంలోనే తన సొంత డబ్బుతో మారేడుమాక - మాని కొండ డొంక రోడ్డు అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరిగిందన్నారు. 2014 నుంచి 2019 మధ్యలో తెలుగుదేశం పార్టీ హయాం లో రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధికి అత్యధిక శాతం నిధులు కేటాయించి అభివృద్ధి చేయ డం జరిగిందని, అదే విధంగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సూరప నేని రామబ్రహ్మం, పూర్ణచంద్రరావు, గంగాదర్‌రావు, విజయ నాగేశ్వరరావు, శ్రీనివాస రావు, ఎస్ నాగకృష్ణమురళి అందించారన్నారు. ఈ సందర్భంగా వారిని బోడె ప్రసాద్ అభినందించారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటుతో మండలంలోని మంతెన, తెన్నేరు, జగన్నాధపురం, కోమటిగుంట, ఉంగుటూరు మండలం బొకినాల గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం జరు గుతుందని విద్యుత్ శాఖ ఏఈ అశోక్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్సీ మురళీమోహన్, ఈఈ పి. హరిబాబు, ఏడీఈ బి. నవీన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, జనసేన నియోజ కవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు మద్దాలి రామచంద్ర రావు, సుదిమళ్ల రవీంద్ర, అన్నే ధనయ్య, మద్దాలి సాయిబాబు, కొండవీటి శివయ్య, సూరప నేని మురళి, యార్లగడ్డ రాజా, ఊసల రామయ్య, వీర్ల వీరబాబు, కె. నాగలింగం, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీతిరుపతమ్మకు కుటుంబసమేతంగా ఆషాఢ సారెను సమర్పిస్తున్న జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి దంపతులు

శ్రీలక్ష్మీ తిరుపతమ్మకు ఆషాఢ సారె

గన్నవరం(ఉంగుటూరు), జూలై 7 : పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా సర్వకార్యసిద్ధి ప్రదాయిని వారాహిదేవి నవరాత్రుల పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందు లోభాగంగా ఆషాఢమాసం తొలి ఆదివారం సారె, పొంగళ్లను భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. తొలుత పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులచే అమ్మవారి సారెను సంప్రదాయబద్ధంగా గ్రామ పురవీధులలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి దంపతులు కుటుంబ సమేతంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ఆషాఢ సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీలలిత సహస్రనామపారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, సహస్ర నామార్చనలతోపాటు విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వటవృక్షానికి పూజలు నిర్వహించడంతోపాటు అంకమ్మతల్లికి ఆషాఢ బోనం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పాటలతో మహిళా భక్తులు నిర్వహించిన కోలాట నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాల వర్ధనరావు, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఉయ్యూరు, జూలై 7 : భూ యజమాని సంతకం నిబంధన తొలగించి గ్రామసభల ద్వారా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్రకార్యదర్శి ఎం.హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీసీఆర్సీ చట్టాన్ని రద్దుచేసి, 2011 ఎల్ఈసీ చట్టాన్ని తిరిగి అమలు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40లక్షల కౌలురైతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ చేపట్టిన సంతకాల సేకరణలో భాగంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా కమిటీతో సమావేశమయ్యారు. ప్రస్తుత రోజుల్లో రాష్ట్రంలో 70 శాతానికి పైగా భూమి కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. కౌలు వ్యవసాయం లాభదాయకంగా లేకపోయినా వివిధ కారణాల వల్ల గ్రామాల్లో ఉన్న దళిత, వెనుకబడిన తరగతులతో పాటు ఇతర కులాల్లో భూమి లేని పేదలు కౌలు చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ ఖర్చులు, పెట్టుబడి విపరీ తంగా పెరగగా మరోవైపు అధిక వర్షాలు, తుఫానులతో చేతికొ స్తున్న పంట నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట, మురుగు కాల్వల నిర్వహణ ప్రభుత్వ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శివనాగేంద్రం, పంచకర్ల రంగారావు పాల్గొన్నారు.

సుపరిపాలనే ధ్యేయం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 7 : పేదలకు సంక్షేమం, యువ తకు ఉపాధి అవ కాశాల కల్పనతో పాటు మల్లవల్లి పారిశ్రా మికవాడ అభివృద్ధికి శక్తిమేర కృషి చేసి నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందిస్తానని, పార్టీ శ్రేణు లను ఇబ్బందులకు గురిచేసే అధికారు లను ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపుల పాడు మండలంలో విజయోత్సవ ర్యాలీ ఎ.సీతారాంపురం వద్ద శనివారం రాత్రి 10 గంటలకు ప్రారంభమవ్వగా హనుమాన్ జంక్షన్ కూడలికి అర్ధరాత్రి ఒంటిగంటకు చేరుకుంది. దారి పొడవునా ఉన్న ఎ.సీతా రామపురం, కోడూరుపాడు, ఉమామహేశ్వరపురం, వీరవల్లి, వేలేరు అడ్డరోడ్డు, మూలకొట్టు సెంటరు, హెచ్‌మార్ట్, విజయడెయిరీ కూడళ్లలో గజమాలలతో, పూలవర్షం కురిపిస్తూ, హారతు లిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీతో అపూర్వమైన ఘనస్వాగతం పలికారు.

హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూచిపూడి కిషోర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విజయోత్సవ కేక్‌ను అభిమానుల నినాదాల మధ్య కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఎంతో మంది అభివృద్ధి ప్రదాతలను అసెంబ్లీకి పంపిన నియోజకవర్గంలో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, ప్రజలు తలవంచుకునేలా ఎలాంటి తప్పుడు పనులు చేయనని అభయాంజనేయ స్వామి పాదాల సాక్షిగా ప్రమాణం చేస్తున్నాన న్నారు. తన రాజకీయ జీవితంలో అభివృద్ధే ప్రధానంగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు కుటుంబంపై నోటికొచ్చి నట్లు మాట్లాడిన వ్యక్తి మన నియోజకవర్గానికి చెందిన వాడు కావడం దురదృష్టకరమన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్‌కళ్యాణ్ వేసిన ముందడుగును ప్రజలు ఆశీర్వదించారన్నారు. కేంద్రలో బీజేపీతో కలిసి వెళ్లడం రాష్ట్రాభివృద్ధికి అన్ని రకాలుగా మంచిదని, శూన్యం నుంచి సంపద సృష్టించగల అపర మేధావి, అభివృద్ధి ప్రదాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మచిలీపట్నం టౌన్ : మితి మీరిన వేగంతో కారులో విజయవాడ నుంచి మంగినపూడి బీచ్‌కు వస్తున్న నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ప్రసాదంపాడు నుంచి మంగినపూడి బీచ్‌కు కారులో దిల్వర్, మొవ్వ నమ్రత, కొమ్మరాజు సాహితీ, సంజయ్‌దత్‌లు వస్తున్నారు. మితిమీరిన వేగంతో వస్తుండగా గూడూరు అడ్డరోడ్డు వద్ద కారు బోల్తా పడటంతో నలుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిని మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మసీదు భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేయాలి

ఉయ్యూరు, జూలై 7 : పమిడిముక్కల మండలం ఫత్తేలంక గ్రామంలో మసీదు మాన్యాలకు చెందిన 32 ఎకరాల 69 సెంట్ల భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిపి వేయాలని ఏపీస్టేట్ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్. అబ్దుల్ ఖదీర్ ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మసీదుకు చెందిన 32ఎకరాల 69 సెంట్ల వ్యవసాయ భూమిని కొందరు ఆక్రమించుకుని క్రయ విక్రయాలు చేస్తున్న వైనాన్ని జిల్లా కలెక్టర్, వక్ఫ్‌బోర్డు అధికారులు, లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డికి 5 సంవత్సరాలుగా తాను ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో వక్ఫ్‌బోర్డు అధికారులు కదిలి, భూము లు స్వాధీనానికి చర్యలు చేపట్టారని, అదే విధంగా గతంలో రైతుల పేర్లతో మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దుచేసి వెబ్‌ల్యాండ్, అడంగల్‌లో మసీదు యాజమాన్యం భూములుగా నమోదు చేయాలని ఉయ్యూరు ఆర్డీవోను వక్ఫ్‌బోర్డు అధికారులు ఆదేశించినట్టు పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ నేత రుద్రరాజుకు ఘనస్వాగతం



రుద్రరాజుకు స్వాగతం పలుకుతున్న ఆ పార్టీ నాయకులు

గన్నవరం(ఉంగుటూరు), జూలై 7 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజుకు ఆదివారం సాయంత్రం గన్నవరం ఎయిర్‌పోర్టులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్న ఆయన రోడ్డుమార్గం గుండా తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. సోమవారం తాడేపల్లిలో జరిగే వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు డీసీసీ జిల్లా అధ్యక్షులు వింతా సంజీవరెడ్డి తెలిపారు. కాగా రుద్రరాజుకు స్వాగతం పలికిన వారిలో పీసీసీ ఉపాధ్యక్షులు ధనేకుల మురళీమోహనరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు పోతురాజు ఏసుదాసు, మేడా సురేష్, డీసీసీ కృష్ణాజిల్లా అధ్యక్షులు వింతా సంజీవరెడ్డి, విజయవాడ నగర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, లీగల్‌సెల్ స్టేట్ చైర్మన్ జంధ్యాల శాస్త్రి, ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భుజంగ నాయక్, తదితరులు ఉన్నారు.

జోరుగా జూదాలు!

●చేతులు మారుతున్న లక్షలు ●మామూళ్ల మత్తులో పోలీసులు

గన్నవరం, జూలై 7 : ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో జోరుగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ప్రతిరోజు లక్షల్లో పేకాట నడుస్తుంది. పోలీసులు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలు వస్తున్నాయి. పలువురు కానిస్టేబుళ్లు పేకాట నిర్వాహకులకు కొమ్ముకాస్తూ మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారు. స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి ఆర్గనైజింగ్ పేకాట నిర్వహిస్తున్నాడని ప్రచారం జరుగుతుంది. తెంపల్లి, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే సూరంపల్లి, కొండపావులూరులో కోడిపందేలు వేస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు పోటీ పడి కోడిపందేలు వేస్తున్నారని పందెం రాయుళ్లే చెప్పటం గమనార్హం. జూదాలపై పోలీసులు ఉక్కుపాదం మోపి నియంత్రించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

సామాజిక న్యాయమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం



బొమ్ములూరులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 7 : మాదిగల హక్కుల సాధన కోసం సామాజిక న్యాయమే లక్ష్యంగా పోరాటం చేసేందుకు ఏకతాటిపై నడిపిన నేత మంద కృష్ణమాదిగ అని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మంద వేణుమాదిగ తెలిపారు. బొమ్ములూరులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం కమిటీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న తమ నేత మంద కృష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గండేపూడి నితీష్‌కుమార్, మెడకుదురు ఏసుపాదం, కలపాల బాలరాజు, కుందేటి ఆదాం, పచ్చిగళ్ల శ్రీనివాసరావు, చీలి మురళి, రవీంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, జూలై 7: "అమరావతి రాజధానికి ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి చేస్తారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీతో జరిగిన భేటీలో అనేక ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. విజయవాడలో ఇప్పుడు ఉన్న ఫ్లైఓవర్‌కు అనుసంధానంగా ప్రభుత్వ హాస్పిటల్ వద్ద నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ సూత్రప్రాయంగా అంగీకరించారు. ఈ ఫ్లైఓవర్ నిర్మిస్తే విజయవాడలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది." అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కరెన్సీనగర్లోని స్థల యజమానుల సంక్షేమ సంఘం కార్యాలయంలో లక్ష్మీఫౌండేషన్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.50

కూచిపూడి నాట్యం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



కూచిపూడి : కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన నాట్యం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ, పరీక్షల అధికారిగా విజయపాల్ వ్యవహరించారు. మృదంగంపై హరినాథ శాస్త్రి, గాత్రం వెంకట దుర్గా భవాని సహకరించారు.



చంద్రశేఖర్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కుంచే నాని

కాలినడకన కనకదుర్గమ్మ ఆలయానికి!

మచిలీపట్నం టౌన్, జూలై 7 : కూటమి విజయం నేపథ్యంలో మొక్కు తీర్చుకునేందుకు టీడీపీ నాయకులు రాగి చంద్రశేఖర్ బృందం ఆదివారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ టీడీపీ కార్యాలయం నుంచి విజయవాడ కనకదుర్గ దేవాలయానికి కాలి నడకన బయలు దేరి వెళ్లారు. టీడీపీ రూరల్ మండలం అధ్యక్షుడు కుంచే నాని మాట్లాడుతూ, కొల్లు రవీంద్ర, వల్లభనేని బాలశౌరి, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గెలుపొందితే కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మ తల్లి అమ్మవారిని సందర్శించుకుంటానని రాగి చంద్రశేఖర్ మొక్కుకున్నారన్నారు. టీడీపీ నాయకులు తిరుపతి, అరుణాచలం తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్లి తమ మొక్కుబడులు సమర్పించుకున్నారన్నారు. జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు కెవివి సత్యనారాయణ, మచిలీపట్నం మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, వంకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పద్మకు రావూరి భరద్వాజ పురస్కారం ప్రదానం చేస్తున్న ఉమాదేవి

రచయిత్రి సింహాద్రి పద్మకు డాక్టర్ రావూరి భరద్వాజ పురస్కారం

గుడివాడ : ప్రముఖ రచయిత్రి, అవనిగడ్డకు చెందిన సింహాద్రి పద్మ ఆదివారం డాక్టర్ రావూరి భరద్వాజ పురస్కారం అందుకున్నారు. గుడివాడలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో తెలుగుభాషా వికాస సమితి సమన్వయకర్త డీఆర్‌బి ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ రావూరి భరద్వాజ 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గాయత్రి మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు చింతలూరి ఉమాదేవి చేతుల మీదుగా పద్మకు డాక్టర్ రావూరి భరద్వాజ పురస్కారం ప్రదానం చేశారు. భవిరి శంకరనాథ్ వసుధ బసవేశ్వరరావు, మోకా మాధవరావు, గాదె మోహన్‌బాబు, డా.ప్రియాంక, సాహితీ వేత్తలు చింతలూరి సత్యనారాయణ, మాల్యాద్రి. డాక్టర్ పి.శ్రీనుబాబు, లీలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గుడివాడ రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

గుడివాడ : రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం రాజేంద్రనగర్‌లోని జి.వి పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా రోటరీ 3020 జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఎ.జ్యోతి, ఇన్‌స్టలేషన్ అధికారి, గుడివాడ రోటరీ క్లబ్ కౌన్సిలర్ జి.బాబుశ్రీకర్ పాల్గొన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా టి.ఎన్.రాజశేఖర్, జి.కిషోర్‌బాబు, కోశాధికారిగా నరహరిశెట్టి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా జి.నరేష్, ఉపాధ్యక్షుడిగా వై.సుహాస్‌లతో పాటు కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. సీనియర్ రోటేరియన్స్, పాస్ట్ ప్రెసిడెంట్స్ పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ముత్తేవి గౌరవ కృష్ణ

ఉచిత కంటి వైద్యసేవలు స్ఫూర్తిదాయకం

కూచిపూడి : ఉచిత కంటి వైద్యసేవలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమ నిర్వాహకులు ముత్తేవి గౌరవ కృష్ణ పేర్కొన్నారు. ప్రవాసభారతీయులు గడ్డమణుగు శివ - నీలిమ దంపతుల సహకారంతో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల (చెన్నై) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం కూచిపూడిలో జరిగింది. గౌరవ కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు. గత నెల 28న శిబిరం ప్రారంభించగా, 135 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించి మందులు అందజేశారు. గడ్డమణుగు శివ శ్రీనివాస్, తుర్లపాటి రాధాకృష్ణ, నేత్రవైద్యులు గజేంద్ర కుమార్ వర్మ, మేనేజర్ ఆరుల్ కుమార్, శివ శ్రీనివాస్, జి.ఎల్.ప్రసాద్, జి.ఎల్.ఎన్.వి.అప్పాజి తదితరులు పాల్గొన్నారు.



రూ.50 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న మండలి వెంకట్రామ్

అగ్నిబాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

నాగాయలంక : అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్ అన్నారు. భావదేవరపల్లిలో అగ్నిబాధిత మలిశెట్టి వెంకటేశ్వరరావును ఆదివారం మండలి వెంకట్రామ్, జనసైనికులు పరామర్శించారు. గ్రామస్థులు, జనసైనికులు కలసి సమీకరించిన రూ.40 వేలు, శ్రీ కృష్ణదేవరాయ సంక్షేమ సంఘం రూ.10 వేలు వెరశి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, భోగాది సోమశేఖర్, పోలిశెట్టి మురారి, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, మండలి బుచ్చిబాబు, పేటేటి శ్రీనివాసరావు, జనసైనికులు పాల్గొన్నారు.

కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలి

బంటుమిల్లి : బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లు తీసుకు రావడం అన్యాయమని సీఐటీయూ నాయకులు అన్నారు. గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో ఆకునూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ప్రజా సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కార్మికుల డిమాండ్స్ డే పాటించడం జరుగుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం వల్ల ఉద్యోగులకు పోరాడే శక్తి పోయే పరిస్థితి వచ్చిందని, సమ్మె హక్కు కాలరాసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. కొత్త కార్మిక చట్టాలను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ధనశ్రీ, మండల కార్యదర్శి మాజేటి శివశ్రీనివాసరావు, కొమ్మలపాటి రవి, నానాజీ, కాగిత శ్రీనివాసరావు, రామకృష్ణ, గుత్తికొండ శ్రీనివాసరావు, వాసింశెట్టి గణేష్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర



విద్యార్థినులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాము



తాడంకిలో కుమార్‌రాజాకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

• ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 7 : విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, అలానే ఉపాధ్యాయుల సమస్యల్లు పరిష్కరిస్తానని గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం జార్జికార్నేషన్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖ బాధ్యతలు విజన్ ఉన్న నారా లోకేష్ మంత్రిగా స్వీకరించారన్నారు. ఆయన దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరి స్తామన్నారు. తొలుత మంత్రి పాఠశాలలో మొక్కలు నాటారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, డీఈవో తాహెరా సుల్తానా, డిప్యూటీఈవో శేఖర్ సింగ్, ఎంఈవో దుర్గాప్రసాద్, పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ సీతాదేవి, హెచ్‌ఎంలు రమణ, తిరుమలరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గుడివాడ : అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఎదగాలనిఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రిటైర్డ్ డీజీపీ కనకరత్న అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఘంటసాల గ్రాండియార్‌లో మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి కాకొల్లు భస్కాకరరావు ఆధ్వర్యంలో జిల్లా జైభీమ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 46 మంది ఎస్సీ విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ రాజ్యలక్ష్మీ, అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ టి.సుదేష్‌బాబు, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోడూరు కృష్ణారావు, ఉప్పులేటి రారాజు, కోశాధికారి సింగవరపు మల్లికార్జునరావు, బండి గోవర్ధనరావు, కొత్తూరి విజయకుమార్, ప్రియనాథుడు, కాటి విశాలి, దారం ఉపేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కుమార్ రాజాను సత్కరిస్తున్న అభిమానులు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తా

కూచిపూడి : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి మన్ననలు పొందుతానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ గ్రామస్థులు ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున హారతులిచ్చి స్వాగతం పలికారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు. లింగమనేని రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, తాడిశెట్టి నరేష్, తాతినేని పూర్ణచంద్రరావు, గుమ్మడి ప్రసాద్, మండవ కోటేశ్వరరావు, వీరంకి తులసీదాస్, కాకి ఝాన్సీ, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడంకిలో వర్ల విజయోత్సవ ర్యాలీ

తాడంకి(పమిడిముక్కల) : పాదయాత్ర సందర్భంగా తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేసి పామర్రు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తాడంకిలో ఆదివారం కూటమి నాయకులు, శ్రేణులు నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొని గ్రామప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, గోవర్ధనరావు, ఆర్.శ్రీనివాసరావు, వై.పిచ్చేశ్వరరావు, పురుషోత్తం, మరళీకృష్ణ, జనసేన నాయకులు తాడిశెట్టి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



కారు బోల్తా పడిన సంఘటనను పరిశీలిస్తున్న రామకృష్ణ, బాధితులకు స్థానికుల సేవలు

కారు బోల్తా నలుగురికి గాయాలు

మచిలీపట్నం టౌన్, జూలై 7 : మితి మీరిన వేగంతో వస్తున్న కారు బోల్తా కొట్టి నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన గూడూరు సమీపంలో మల్లవోలు అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. విజయవాడలో ప్రసాదంపాడు చెందిన నలుగురు యువతీయువకులో కారులో మంగినపూడి బీచ్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు పొలాల్లోకి బోల్తా కొట్టడంతో దానిలో ప్రయాణిస్తు న్న దిల్వర్, మొవ్వ నమ్రత, కొమ్మరాజు సాహితీ, సంజయ్‌దత్ తీవ్రంగా గాయపడ్డారు. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గూడూరు పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమా ద స్థలాన్ని నియోజకవర్గ జనసేన ఇన్ చార్జి రామకృష్ణ సందర్శించారు. బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

సరుకులో తేడాలు

ఎండీయూ వాహనం సీజ్

నాగాయలంక : తిప్పపాలెం రామాలయం వద్ద రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ-2 వాహనాన్ని పీడీఎస్ డీటీ ఎం.నరసింహారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకులో వ్యత్యాసమున్నట్లు గుర్తించారు. రేషన్ బియ్యం సుమారు 200 కేజీలు, పంచదార అర కేజీ ప్యాకెట్లు 50 వ్యత్యాసం ఉండడంతో వాహనాన్ని సీజ్ చేసి సరుకులతో సహా నాగాయలంక రేషన్ షాపు నెంబర్-6 డీలర్‌కు అప్పగించారు. తదుపరి చర్యలు నిమిత్తమై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని ఆయన తెలిపారు.

బీమా, సేవా రంగంలో బాషా సేవలు అభినందనీయం

చల్లపల్లి : మూడు దశాబ్దాలకు పైగా ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎనలేని సేవలందించి సంస్థ పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న షేక్ గయాజ్ అహ్మద్ బాషా (ఎల్ఐసీ బాషా) బీమా రంగంతోపాటు లయనిజం ద్వారా సేవా రంగంలోనూ తనదైన ముద్ర వేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్‌జీఏ బాషా సన్మాన సభ మేకావారిపాలెంలోని ఆర్‌కె కన్వెన్షన్‌లో జరిగింది. అవనిగడ్డ ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సన్మానసభలో మచిలీపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ సుధాకర్‌బాబు, ఎంఎం శివనాగప్రసాద్, ఎస్ఎం శివప్రసాద్, రేపల్లె బీఎం జి.ఉమామహేశ్వరరావు, అవనిగడ్డ ఏబీఎం కె.సాయిరాం కిరణ్‌తోపాటు వివిధ బ్రాంచ్‌ల బీఎంలు, ఏబీఎంలు, డెవలప్ మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు పాల్గొని బాషా సేవలను కొనియాడి సన్మానించారు. లయన్స్‌క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ దామెర్ల శ్రీశాంతి, లయన్స్‌క్లబ్ పెద్దలు లయనిజం ద్వారా చేసిన సేవలు గుర్తుచేశారు. చల్లపల్లి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, రాయపాటి రాధా కృష్ణ, నర్రా సాయిబాబు, దుబ్బుల సాంబశివరావు, కాట్రగడ్డ రామ్మోహన రావు, టి.సాంబశివరావు, అడపా గురవయ్య, వరదా హరిగోపాల్, కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, ముమ్మనేని నాని, కస్తూరి ప్రసాద్ తదితరులు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాషా దంపతులను సన్మానించారు.



బాషా దంపతులను సన్మానిస్తున్న చల్లపల్లి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, లయన్స్‌క్లబ్ మల్టిపుల్ ఛైర్‌పర్సన్ శ్రీశాంతి

చేపల మార్కెట్‌ను మత్స్య వాణిజ్య కేంద్రంగా గుర్తించాలి



ఎండు చేపల మార్కెట్‌లో మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న లకనం నాగాంజనేయులు

నాగాయలంక, జూలై 7 : నాగాయలంక ఎండుచేపల మార్కెట్‌ను మత్స్య వాణిజ్య కేంద్రంగా గుర్తించి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి, టీడీపీ జిల్లా నేత లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ప్రజాప్రతినిధులు, మత్స్యకార నేతలతో కలసి చేపల మార్కెట్‌ను పరిశీలించారు. మత్స్యకార మహిళలు మార్కెట్‌లో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 37 గ్రామాల మహిళా మత్స్యకారులు మార్కెట్‌లో ఎండు చేపల అమ్మకాలు చేస్తుంటారన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వినియోగదారులు వచ్చి ఎండు చేపలు, రొయ్యలు కొనుగోలు చేస్తుంటారన్నారు. పచ్చి చేపలను, రొయ్యలను, ఎండు చేపలు, ఎండు రొయ్యలుగా తయారు చేసే పనిని ఉపాధిగా చేసుకుని వేలాది మంది మహిళా మత్స్యకారులు ఉపాధి పొందుతూ జీవిస్తున్నారన్నారు. వీరు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని నాగాంజనేయులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్, మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, కృష్ణా డెల్టా మత్స్య సహకార సంఘం మాజీ డైరెక్టర్ నాగిడి తాతారావు, పొనమాల వెంకటేశ్వరమ్మ, లంకే నారాయణమ్మ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఫార్మసీ ప్రిన్సిపాల్ లక్ష్మణరావుకు ఉత్తమ ప్రజంటేషన్ అవార్డు

గుడ్లవల్లేరు : డయాబెటిస్ వ్యాధికి సంబంధించి ఔషధాల పరిమాణామాన్ని అంచనా వేసే నిర్దిష్ట పద్ధతులపై ప్రజంటేషన్ ఇచ్చిన గుడ్లవల్లేరు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావుకు జాతీయస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును లక్ష్మణరావు అందుకొన్నారు. కళాశాలం చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ రావు, సహకార్యదర్శి రామకృష్ణ తదితరులు లక్ష్మణరావును అభినందించారు.

ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో అడ్మిషన్లకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

పమిడిముక్కల : ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులలో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు కళశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించి డిగ్రీలో చేరుటకు ఆన్‌లైన్ రిజిష్ట్రేషన్ కళాశాలలో ఉచితంగా చేస్తున్నామన్నారు. వివరాలకు 9849244585, 9553539203 సెల్ నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

అప్రెంటీస్ మేళా నేడు

గుడివాడ : కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న జరిగే అప్రెంటీస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి శనివారం ఒక ప్రకటనలో కోరారు.

పైడమ్మకు ఆషాఢ సారె

పెడన : ఆషాఢ మాసం సందర్భంగా పెడన పైడమ్మతల్లికి అత్తింటి దాసు వంశానికి చెందిన మహిళలు ఆదివారం తొలిసారె సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న మహిళలు పైడమ్మ తల్లికి ఆషాడమాస సారె సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, మురళికుమారి దంపతులు పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

చల్లపల్లి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం చల్లపల్లి ప్రధాన సెంటర్లో ఆదివారం ఘనంగా జరిరింది. మండలి వెంకట్రామ్ కేక్ కట్‌చేసి యువకులకు పంచిపెట్టారు. మోర్ల రాంబాబు, పైడిపాముల స్వప్న, రావి చిట్టి, మోర్ల శివ, జనసేన పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, ఎమ్మార్పీఎస్ నేతలు కొక్కిలిగడ్డ నవీన్, కొడాలి ఏలియా, కల్లూరి సురేంద్ర, మట్టా నాని, జువ్వనపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** మండల పరిధిలోని సూరపనేనివారిపాలెంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు బొకినాల కృష్ణ, కొడాలి డేవిడ్ రాజ్, రాచూరి రాజశేఖర్, పోలిమెట్ల ప్రవీణ్, జంపన డేవిడ్, చిట్టూరు కోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ చంటి, కొడాలి చింటూరు తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జాతీయ అత్యవసర పరిస్థితి (1975) ఒక సమగ్ర అవగాహన

ఇటీవల 18వ లోక్‌సభ కొలువుతీరిన తొలి రోజున భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించి 49 ఏళ్ల కావస్తున్న సందర్భంగా ప్రధాని ఆనాటి దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన యోధులకు నివాళి అర్పించారు. అదేవిధంగా స్పీకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్ని భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా వర్ణించారు. సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. ఈ సంఘటన 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితిపై దేశప్రజలందరూ దృష్టిసారించేలా చేసింది. ఈ నేపథ్యంలో 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు కారణాలు, ఎమర్జెన్సీ కాలపు నిరంకుశ పద్ధతులు, రాజ్యాంగ సవరణలు, తదనంతర కాలంలో తీసుకొచ్చిన రాజ్యాంగ మార్పులు తదితర అంశాలపై అవగాహన అవశ్యకం.

భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి నిబంధనల చేర్పు

ఏవైనా అంతర్గత లేదా బాహ్య కారణాలు లేదంటే ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటే ఆ పరిస్థితులనే అత్యవసర పరిస్థితులుగా పరిగణిస్తారు. వీటిని ఎదుర్కొనడానికి, దేశాన్ని ఏకతాటిపై ఉంచడానికి కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అవసరమని, ఆ అధికారాలను రాజ్యాంగ నిబంధనల పరంగా అందించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్, టీ.టీ.కృష్ణమాచారి, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ వంటి న్యాయ కోవిదులు రాజ్యాంగ రచన సమయంలో భావించారు. ఈ అధికారాల నిరంకుశత్వాన్ని గ్రహించిన ప్రొ.కె.టి. షా, పీ.డీ.దేశ్‌ముఖ్, హెచ్.వీ.కామత్ వంటివారు వ్యతిరేకించడంతో వీటిని ప్రయోగించాల్సిన పరిస్థితులు పెద్దగా రాకపోవచ్చని, అన్యదా అవసరాల కోసమే వీటిని క్రోడీకరిస్తున్నామని వీటిని మృతాక్షరాలుగా పేర్కొనవచ్చని రాజ్యాంగ పరిషత్ చర్చల్లో అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ 1975 నుంచి 1977 మధ్యకాలంలో 21 నెలలు దేశం చూసిన చీకటి రోజులు అంబేద్కర్ ఆకాంక్షకు గండికొట్టాయి.

> అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీదళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్టు చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

భారతదేశంలో 1975 నాటి అత్యవసర పరిస్థితి-పరిణామాలు

1971లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రజా ప్రాతినిథ్య చట్టం-1951ని ఉల్లంఘించారని, నిబంధనలకు వ్యతిరేకంగా తన ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వ వనరులను పెద్ద ఎత్తున వినియోగించారు కాబట్టి ఇందిర ఎన్నిక చెల్లదని ఆమె ప్రత్యర్థి రాజ్‌నారాయణ్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రాతినిథ్య చట్టంలోని సెక్షన్ 123(7) ప్రకారం ఇందిరాగాంధీ చర్యలను చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. అలాగే ప్రధానిగా కొనసాగరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల నిషేధం వర్తిస్తుందని తీర్పు చెప్పింది.

ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిరాగాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని అయితే ఆమె పార్లమెంట్‌లో జరిగే ఏ ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని, ఎంపీగా ఆమెకు లభిస్తున్న అన్ని సదుపాయాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.



అప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల్లో అవినీతి; నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అశాంతి మొదలైంది. 1979లో గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, మధ్యతరగతి ప్రజ లు భారీగా ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. నవ నిర్మాణ్ ఉద్యమం కారణంగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. జార్జి ఫెర్నాండెజ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రైల్వే సమ్మె నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హై కోర్టు తీర్పునివ్వడం ఈ పరిస్థితులకు ఆజ్యం పోసింది. ఇందిరాగాంధీ రాజీనామా కోసం విపక్షాలు పట్టుబట్టాయి.

సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొంది ప్రధానిగా కొనసాగే అనుమతిని ఆమె తెచ్చుకోవడంతో తరవాతి రోజు 1975 జూన్ 25న ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోరాటం తీవ్రం చేసేందుకు నిర్ణయించాయి. ఇటువంటి అననుకూల పరిస్థితుల్లో 1975 జూన్ 25 అర్ధరాత్రి జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. మంత్రిమండలిని సంప్రదించకుండానే రాష్ట్రపతికి అత్యవసర పరిస్థితి విధించాల్సిందిగా ఇందిరాగాంధీ సిఫార్సు చేశారు. ప్రతిపక్షాలను అణచివేసి తాను పదవిలో కొనసాగేందుకే రాజ్యాంగ ప్రకరణ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని వక్రీకరించి అత్యవసర పరిస్థితి విధించారనే అపకీర్తిని ఇందిర మూటగట్టుకున్నారు. ఈ అత్యవసర పరిస్థితి కాలంలో ఆచరించిన అనేక నిరంకుశ విధానాలు కూడా తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

1975 అత్యవసర పరిస్థితి కాలం నాటి వివిధ పరిణామాలు

అత్యవసర పరిస్థితి విధించిన కొన్ని గంటల్లోనే అనేక రాజకీయ పార్టీల నాయకులు అరెస్ట్ అయ్యారు. విజయరాజె సింధియా, జయప్రకాష్ నారాయణ, ములాయం సింగ్ యాదవ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, అటల్ బిహారీ వాజపేయి, జ్యోతిబసు, అద్వానీ, అరుణ్ జైట్లీ వంటి పలువురు ప్రముఖులు వీరిలో ఉన్నారు. వీరందరూ ప్రధానంగా 'మీసా'(ఎంఐఎస్ఏ- మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్), డీఐఎస్ఐఆర్(డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్ అండ్ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్), సీఓఎఫ్ఈపీఓఎస్ఏ(కన్జర్వేషన్ ఆఫ్ ఫారిన్ ఎక్స్చేంజ్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ యాక్టివిటీస్ యాక్ట్) వంటి కఠిన చట్టాల కింద అరెస్టయ్యారు. జమాతే ఇస్లామీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలపై నిషేధం విధించారు.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీదళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్


దిశలు - దూరాలు ● రీజనింగ్



ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

ముఖ్య రేఖాచిత్రం




నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకొంటే మిడిల్ పాయింట్‌కు కుడివైపు అంటే తూర్పు, ఎడమవైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

1. వినయ్ 40మీ. పడమరకు నడిచిన తరవాత దక్షిణం వైపునకు తిరిగి 30మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు 25మీ. నడిచిన తరవాత ఉత్తరానికి తిరిగి 20మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు తిరిగి 15 మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?

ఎ) ఉత్తరం 10 మీ. బి) దక్షిణం 10 మీ.
సి) తూర్పు 10 మీ. డి) పడమర 10 మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం (L)నకు, చేరుకున్న స్థానం (M) కిందకు ఉంది.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)ను పరిశీలిస్తే మిడిల్ పాయింట్ నుంచి కిందకు అంటే దక్షిణం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి వినయ్ బయలుదేరిన స్థానం నుంచి 10 మీ. దూరంలో ఉన్నాడని తెలుస్తుంది. సమాధానం దక్షిణం 10 మీ.

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారాన్ని రాసుకోవాలి. అది ఏమంటే పడమర 40, దక్షిణం 30, తూర్పు 25, ఉత్తరం 20, తూర్పు 15. తరవాత ఒకే దిశకు సంబంధించినవి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఉంటే కూడాలి. పై సమాచారంలో తూర్పు 25, తూర్పు 15 లను కూడితే తూర్పు 40 అవుతుంది. ఇప్పుడు పై సమాచారం కింది విధంగా ఉంటుంది.

పడమర$_{40}$, దక్షిణం$_{30}$, తూర్పు$_{40}$, ఉత్తరం$_{20}$.


ఇప్పుడు వ్యతిరేక దిశల విలువ సమానంగా ఉంటే అది క్యాన్సిల్. పై సమాచారంలో పడమర$_{40}$, తూర్పు$_{40}$లు క్యాన్సిల్ అవుతాయి. మిగిలిన రెండింటిలో ఏది ఎక్కువ, ఎంత ఎక్కువ అదే సమాధానం అవుతుంది. తూర్పు$_{40}$, పడమర$_{40}$ క్యాన్సిల్ అవగా మిగిలిన దక్షిణం$_{30}$, ఉత్తరం$_{20}$ లలో దక్షిణం$_{10}$ ఎక్కువ ఉంది అదే సమాధానం అవుతుంది.

2. వినోద్ 5మీ. ఉత్తరానికి నడిచిన తరవాత కుడివైపునకు తిరిగి 6మీ. నడిచాడు. తదుపరి మరల ఎడమవైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వినోద్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

ఎ) 10 మీ. బి) 14 మీ. సి) 12 మీ. డి) 18 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:



D- బయలుదేరిన స్థానం, E- చేరుకున్న స్థానం.

DF- ఒక భుజము 6 మీ॥. EF- మరో భుజము 8 మీ॥ (5 + 3)

DE- కర్ణము

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణము^{2} = భుజము^{2} +భుజము^{2}

$$\text{కర్ణము}^2 = 6^2 + 8^2$$
$$\text{కర్ణము}^2 = 36 + 64$$
$$\text{కర్ణము}^2 = 100$$
$$\text{కర్ణము} = \sqrt{100} = 10\text{మీ॥}$$

వినోద్ బయలుదేరిన స్థానం (D)కు చేరుకున్న స్థానం (E) 10 మీ. దూరంలో ఉంది.

3. A, B, C, D అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యార మ్స్ ఆడుతున్నారు. B, D భాగస్వాములు. A ఉత్తరానికి ముఖభా గం కలిగి ఉన్నాడు. D తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?

ఎ) B బి) C సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: A, B, C, D నలుగురు నాలుగువైపులా కూర్చుంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. B, D భాగస్వాములని చెప్పారు. కాబట్టి A, C మరొక భాగస్వాములు అవుతారు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. A, Cలు భాగస్వాములు కనుక దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'C' అవుతారు.

సమాధానం: సి



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డగోలుతనం

- వైసీపీ హయాంలో పదోన్నతుల్లో ఇష్టారాజ్యం
- వీరభక్త అధికారులకు వరుస పదోన్నతులు
- ఓ డీఈఈ కేడర్ అనతికాలంలో సీఈగా..
- సుప్రీం, హైకోర్టు మార్గదర్శకాలు బేఖాతర్
- ఐదేళ్లూ భయంతో నోరెత్తని బాధిత ఉద్యోగులు
- కూటమి ప్రభుత్వం రావడంతో ఫిర్యాదులు
- వైసీపీ అస్మదీయ అధికారుల భారీ అవినీతి
- భారీ విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలపై విచారణ జరిపించాలని కాంట్రాక్టర్ల వినతి
- డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదుల వెల్లువ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారు. సీనియారిటీని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికారులకు ప్రమోషన్ ఇచ్చారు. వైసీపీకి వీరవిధేయులుగా ఉన్న వారికి నాటి ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో అతి తక్కువ కాలంలోనే పదోన్నతుల మీద పదోన్నతులు కల్పించారు. సంస్థను అవినీతి మేతగా మార్చేశారు. పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతున్నా అప్పట్లో ఏ ఒక్క అధికారి కూడా ఎదిరించలేకపోయారు. బాధిత అధికారులు కోర్టును ఆశ్రయించినా ఖాతరు చేయకుండా అయినవాళ్లకు అడ్డగోలుగా పోస్టుల సంతర్పణ చేశారు. ఐదేళ్లూ మౌన వేదన అనుభవించిన అధికారులు కూటమి ప్రభుత్వం రావటంతో జరిగిన అన్యాయాలపై గొంతెత్తుతున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దల అండదండలతో తమకు తీరని అన్యాయం చేసిన వైసీపీ వీరవిధేయ అధికారులపై తాజాగా డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు బాధిత అధికారులు ఫిర్యాదులు చేశారు. పలువురు కాంట్రాక్టర్లు కూడా అవినీతి అధికారులపై విచారణకు ఆదేశించాలని ఫిర్యాదులు చేశారు. దీన్నిబట్టి గ్రామీణ నీటి సరఫరా విభాగాన్ని వైసీపీ పెద్దలు అవినీతి మేతతో ఎంతగా నిర్వీర్యం చేశారో, వ్యవస్థను ఎంత భ్రష్టుపట్టించారో అర్థమవుతుంది.

వైసీపీ పెద్దల సిఫారసుతో...

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందిన ఫిర్యాదుల మేరకు.. విజయవాడ గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ పోస్టును సీనియారిటీ జాబితాలో లేని వ్యక్తికి నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టారు. ఈఎన్‌సీ కార్యాలయంలో నాలుగు చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఉన్నాయి. ఈఎన్‌సీతో పాటు మరో మూడు సీఈ పోస్టులు ఉన్నాయి. అదనపు సీఈ పోస్టు అవసరం లేదు. కానీ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఒక డీఈఈకి చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పదోన్నతి ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి చీఫ్ ఇంజనీర్ల (సీఈ) పోస్టులకు రోస్టర్ లేదు. ఈఎన్‌సీతో కలిపి నలుగురు చీఫ్ ఇంజనీర్లు ఉండగా.. దొడ్డిదారిన ఐదో చీఫ్ ఇంజనీర్‌గా వైసీపీ ప్రభుత్వ పెద్దలు సిఫార్సు చేసిన డీఈఈని తెరమీదకు తీసుకువచ్చారు. ఆ వ్యక్తి డీఈ కేడర్ అయినా వైసీపీ పెద్దలతో తనకున్న పలుకుబడితో ఇన్‌చార్జి ఈఈ, ఎస్ఈ, సీఈలుగా పలు సందర్భాలలో పని చేశారు. ఆయన కంటే ఎక్కువ సీనియారిటీ గల వారు చాలామంది ఉన్నా.. వారందరిని పక్కన పెట్టి మరీ పదోన్నతి కల్పించారు. ఆయనను రిజర్వేషన్ల ప్రాతిపదికన నియమించినట్టు వైసీపీ వీరవిధేయ ఉన్నతాధికారులు వాదించారు. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆయనకు పదోన్నతి కల్పిస్తే, అదే రిజర్వేషన్ల ప్రకారం సీనియారిటీ ఉన్న పలువురు అధికారులకు న్యాయం చేయాలి కదా? వారికెందుకు న్యాయం చేయలేదన్నది ఇక్కడ ప్రశ్న. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆ డీఈఈకి పదోన్నతి కల్పించారనుకుంటే.. ఆ దామాషా ప్రకారం ఇప్పటికే పదోన్నతులు కల్పించారు. రిజర్వేషన్ల దామాషా పూర్తయితే ఆ పేరుతో అదనపు పదోన్నతులు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు గతంలో జర్నయిల్ సింగ్ అనే వ్యక్తి వేసిన కేసులో నిర్దేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ వీరభక్త అధికారికి నిబంధనలకు విరుద్ధంగా ఈఎన్‌సీ పదోన్నతి అందుకునేలా సీనియారిటీని కూడా కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చారు. డీఈఈకి అతి తక్కువ సమయంలో ఈఈ, ఎస్ఈ, సీఈగా పదోన్నతులు కల్పించారు. ఈఎన్‌సీగా పదోన్నతిగా పొందేందుకు కూడా లైన్ క్లియర్ చేశారు. ఓ అధికారికి ఇలా సీనియారిటీ కల్పించటం ఎక్కడైనా ఉంటుందా? ఎంత రిజర్వేషన్లు చూసుకున్నా ఇలాంటి విధానం ఎక్కడైనా ఉంటుందా? అని బాధిత అధికారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో ఎస్సీ, ఎస్టీ పదోన్నతులకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిందిగా నిర్దేశించింది. గత వైసీపీ ప్రభుత్వం తెలివిగా ఈ అంశాన్ని తాత్సారం చేయటం కోసం ఐఏఎస్ అధికారులతో కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇప్పటి వరకు ఎలాంటి నివేదికా ఇవ్వలేదు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

ఆర్‌డబ్ల్యూఎస్‌లో సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవటంతో బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘాలు 2020లో హైకోర్టును ఆశ్రయించాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పదోన్నతులు అమలు చేయాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాలను కూడా వైసీపీ ప్రభుత్వం ఖాతర్ చేయలేదు. తమకు అన్యాయం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో సీనియారిటీ ఉన్న 20 మంది పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు మళ్లీ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు జారీ చేసిన ప్రతిసారీ అమలు చేస్తున్నట్టుగా ఉత్తర్వులు ఇవ్వటం, ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వటం తప్పితే.. పదోన్నతుల విషయంలో మళ్లీ పాత తంతునే పాటిస్తున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ జీఓలు, గెజిట్ నోటిఫికేషన్ల ప్రకారం ఆర్‌అండ్‌బీ వంటి మిగిలిన ఇంజనీరింగ్ విభాగాలలో తమకు అన్వయించుకుని అమలు చేస్తుండగా.. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో మాత్రం అమలు చేయటం లేదు.

అడ్డగోలుగా చెల్లింపులు

వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా తమకు అనుకూలంగా పనిచేసిన ఏఈఈలకు డీఈ, ఈఈ పోస్టులను కట్టబెట్టారని, అడ్డగోలుగా ఎంబుక్‌లను రికార్డు చేయించి బిల్లులు చెల్లింపులకు పాల్పడారని బాధిత అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ను పూర్తిగా అవినీతిమయంగా మార్చేశారని, శాఖను భ్రష్టుపట్టించారని తమకు న్యాయం చేయాల్సిందిగా పవన్ కల్యాణ్‌కు అభ్యర్థించారు.

అవినీతిపై విచారణ జరిపించండి

వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరభజన చేస్తూ వారి పాపంలో భాగస్వామ్యం పంచుకున్న అవినీతి అధికారులు ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టుకున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పలువురు కాంట్రాక్టర్లు ఫిర్యాదులు చేశారు. అవినీతి సొమ్ముతో అక్రమ సౌధాలు నిర్మించుకున్నారని, విల్లాలు, భారీ బహుళ అంతస్తుల భవనాలను కట్టిస్తున్నారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆ దిశగా దృష్టి సారిస్తున్నట్టు సమాచారం. ఓ అధికారి భారీగా అవినీతికి పాల్పడ్డారని, పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు కట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



తాడేపల్లి సమీప కుంచనపల్లిలో కొనుగోలు చేసిన విల్లా



అనంతపురంలో ఓ భవనం, నిర్మాణంలో ఉన్న మరో భవనం



తెలంగాణలో మొయినాబాద్‌లోని గెస్ట్‌హౌస్



పెళ్లి.. చాలా కాస్ట్‌లీ గురూ!

- ఈ ఏడాది అంచనా 10.85 లక్షల కోట్లు
- అమెరికాలో కంటే భారత్‌లో రెట్టింపు వ్యయం

న్యూఢిల్లీ, జూలై 7: ప్రతి మనిషి జీవితంలో ఒకే ఒక్కసారి జరిగే వేడుక పెళ్లి. తల్లిదండ్రులు తమ హోదాకు తగినట్టు ఖర్చుకు వెనుకాడకుండా పిల్లల వివాహాలను వైభవంగా జరిపిస్తారు. పేదలు కూడా అప్పు చేసైనా ఉన్నంతలో చేస్తారు. ధనవంతులైతే కోట్లకు కోట్లు ఖర్చు చేసేస్తారు. మన దేశంలో ఈ మధ్యకాలంలో పెళ్లిళ్ల కోసం చేస్తున్న ఖర్చు బాగా పెరిగిపోతోంది. జెఫరీజ్ గ్రూప్ నివేదిక ప్రకారం... ఈ ఏడాది మన దేశంలో పెళ్లిళ్లకు అయ్యే ఖర్చు దాదాపు రూ.10.85 లక్షల కోట్లు ఉండొచ్చని అంచనా! భారతీయులు ఆహారం, కిరాణ సరుకుల కోసం చేసే వ్యయం తర్వాత పెళ్లిళ్లకు చేసే ఖర్చు రెండో స్థానంలో ఉంది. పిల్లల చదువు కోసం చేసే ఖర్చు కంటే పెళ్లిళ్లకు రెట్టింపు చేస్తున్నారు. భారతీయులు సగటున ఓ పెళ్లికి రూ.12 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈ నెలలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో ఎక్కువగా జరుగుతాయి. దాదాపు 90 శాతం వివాహాలు పెద్దలు కుదిర్చినవే.

ప్రత్యేకతలు

ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో ఏటా దాదాపు 80 లక్షల నుంచి కోటి వివాహాలు జరుగుతాయి. అమెరికాతో పోలిస్తే భారత్‌లో వివాహాలకు రెట్టింపు ఖర్చు చేస్తారు. చైనాతో పోలిస్తే మాత్రం భారత్‌లోనే ఖర్చు తక్కువ.

కొత్త ట్రెండ్

సాధారణంగా వధువు సొంతూరులోనో లేదా వధూవరుల కుటుంబాలకు అనుకూలమైన చోట వివాహ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇటీవల కాలంలో వివాహ సంప్రదాయంలో కొత్త ట్రెండ్ మొదలైంది. డబ్బున్నవారు గోవా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, అండమాన్స్ వంటి ప్రాంతాలకు వెళ్లి అంగరంగ వైభవంగా వివాహ వేడుకలు చేసుకుంటున్నారు.

ఉపాధి

పెళ్లిళ్ల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది. కేటరింగ్, డెకరేషన్, గిఫ్టులు, ఫొటోగ్రాఫర్స్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, పెయింట్స్, ట్రావెల్, ప్లానర్స్ తదితరాలకు భారీగా ఖర్చు చేస్తారు. పెళ్లి బడ్జెట్‌లో ఎక్కువగా బంగారు ఆభరణాలకు ఖర్చు చేస్తారు.

పని ఇప్పిస్తామని పడుపు వృత్తిలోకి..

- యువతుల దుస్థితిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్
- వెంటనే చర్యలకు రాష్ట్రాలు, యూటీలకు నోటీసు
- బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసానికి జాతీయ విధానం
- కేంద్రం, రాష్ట్రాలకు హక్కుల కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, జూలై 7: పని ఇప్పిస్తామని చెప్పి, యువతులను బలవంతంగా పడుపు వృత్తిలోకి దించుతున్న వైనంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. దీనిపై తమకు అందుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. నిజానిజాలు నిగ్గు తేల్చాలంటూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కమిషన్ కోరింది. ఈ మేరకు నోటీసులు జారీచేసింది. రాంచీ (బిహార్), ఝార్ఖండ్‌లో ఈ నెల ఒకటో తేదీన హోటళ్లు, లాడ్జీలపై దాడులు చేసి అరెస్టులు చేసినప్పుడు చాలామంది మహిళలు తమను బలవంతంగా పడుపు వృత్తిలోకి లాగారని తెలిపారని వివరించింది. కొన్ని అసాంఘిక శక్తులు తమకు పని ఇప్పిస్తామని నమ్మించి ఈ సాలెగూడులోకి తెచ్చి పడేశాయని చెప్పినట్టు వార్తలు వస్తున్నాయన్నారు. ఆ వార్తలు నిజమే అయితే, వెంటనే చర్యలు చేపట్టాలని ఆ నోటీసులో కమిషన్ కోరింది. కాగా, బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసం కోసం జాతీయ విధానం రూపొందించాలని ప్రభుత్వాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సిఫారసు చేసింది. దేశవ్యాప్తంగా ఎంతమంది ఇటువంటివారు ఉన్నారనే సమాచారంతో జాతీయ స్థాయిలో డేటాబేస్‌ను ఏర్పాటుచేయాలని కూడా తన ప్రతిపాదనల్లో కోరింది. వీటిపై వీలైనంత త్వరగా జాతీయ సమగ్ర విధానం అవసరమని అభిప్రాయపడింది. భిక్షం ఎత్తాల్సిన పని లేని పరిస్థితులను సృష్టించేలా, ఆ వృత్తిలోని వారు మెరుగైన జీవితం గడపేలా ప్రణాళికలు తయారుచేయాలని కేంద్రం, రాష్ట్రాలను కోరింది. ఇప్పటికే పలు సంస్కరణలు, పథకాలు, కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నా, బిచ్చగాళ్ల సమస్య పెరుగుతుండటం పట్ల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది.



యూరాలజీ సదస్సులో పాల్గొన్న వైద్యులు

మూత్రనాళాలు సన్నబడుతున్నాయ్

- రోడ్డు ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు కారణం
- ఇటీవల పెరిగిన ఈ శస్త్రచికిత్సల సంఖ్య
- యూరాలజీ సదస్సులో వైద్యుల వెల్లడి

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మూత్రనాళాలు సన్నబడిపోతున్నాయని, దాంతో శస్త్రచికిత్స చేసి సరిచేయాల్సి వస్తోందని, ఈ తరహా ఆపరేషన్లు ఇటీవల కాలంలో బాగా పెరిగాయని వైద్య నిపుణులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల మూత్రనాళాలు సన్నబడుతున్నాయని వారు వివరించారు. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో యూరాలజీ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 8 దేశాలతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా యూరాలజిస్టులు హాజరయ్యారు. మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సల్లో సరికొత్త ప్రక్రియలపై సదస్సులో చర్చించారు. మూత్రనాళాలు సన్నబడే అవకాశాలు పురుషుల్లో ఎక్కువగా ఉంటాయని, ఇటీవల మహిళలు, పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. మూత్రనాళాలు సన్నబడి మూత్రవిసర్జన తగ్గడం, దానివల్ల సమస్యలు వచ్చినప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, ఇన్ఫెక్షన్ల వల్ల మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి వస్తోందన్నారు. యూరాలజిస్టు డాక్టర్ భవతేజ్ ఎన్ గంటి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఫ్రాక్చర్లు అయినప్పుడు మూత్రనాళాలు కూడా దెబ్బతింటాయని, అలాంటప్పుడు కొన్ని నెలలు వేచి ఉండి, తర్వాత సరిచేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ కాలం పాటు ఆస్పత్రిలో ఉన్నప్పుడు క్యాథటర్స్ అమర్చడం, ఇతర వ్యాధుల వల్ల కూడా మూత్రనాళాలు సన్నబడుతున్నాయన్నారు. ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో వెయ్యికి పైగా శస్త్రచికిత్సలు చేశామని తెలిపారు. దేశంలో మూత్రనాళ శస్త్రచికిత్సల్లో అగ్రగణ్యులుగా పేరొందిన డాక్టర్ సంజయ్ కులకర్ణి (పుణె), డాక్టర్ గణేష్ గోపాలకృష్ణన్ (కోయంబత్తూరు), ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్ అజిత్ రంగ్నేకర్ మాట్లాడారు.